సాక్షి
కుమురం భీం

సోమవారం, 3, జూలై, 2023



డువ్వల్‌పేన్‌కు ప్రత్యేక పూజలు

కెరమెరి మండలం చిన్నసాకడలో ఆదివాసీలు 'డువ్వల్ పేన్' (పులిదేవత) పూజలు నిర్వహించారు. వనంలోనే సహపంక్తి భోజనం చేశారు. 8లో▸



ప్రకృతి వనంలో ఓ సమాధి!

గుండాయిపేట ప్రకృతివనంలో సమాధి ఉండటంతో ప్రజలు అటువైపు వెళ్లడం లేదు. దీంతో ప్రకృతివనం మందుబాబులకు అడ్డాగా మారింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.6 /27.3

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సీఆర్టీ అర్హత పరీక్ష



పరీక్ష కేంద్రంలో డీటీడీవో మణెమ్మ

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీఆర్టీ ఎస్‌ఏ అర్హత పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల భర్తీకి నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లాలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 762 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 659 మంది హాజరయ్యారు. 103 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థుల మెరిట్ జాబితాను త్వరలోనే విడుదల చేస్తామని డీటీడీవో మణెమ్మ తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీటీడీవో పర్యవేక్షించారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రతీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం సిర్పూర్ నియోజకవర్గ మహాజన్ సంపర్క్ అభియాన్ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మురళీధర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పథకాలను ప్రజలకు తెలియజేయడమే మహాజన్ సంపర్క్ అభియాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం, న్యాయం, ధర్మం కోసం పని చేస్తుందన్నారు. అనంతరం కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల్లో స్కాంలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులను ఆదుకోవాలి

ఆసిఫాబాద్: మహారాష్ట్రకు పత్తి పంట తరలిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం జిన్నింగ్ మిల్లులను ఆదుకోవాలని కాటన్ అండ్ ఆయిల్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఫీక్ జివానీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా నుంచి పత్తిపంట మహారాష్ట్రకు తరలిపోవడంతో తెలంగాణకు రావాల్సిన 5శాతం జీఎస్టీని వ్యాపారులు అక్కడి ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని తెలిపారు. దీంతో జిల్లాలో జిన్నింగ్ మిల్లులు తీవ్ర నష్టాల్లో నడుస్తున్నాయని, పరోక్ష ఈ పరిశ్రమలపై ఆధారపడిన వేలాది మంది ఉపాధి కోల్పోతున్నారని వెల్లడించారు. సమస్యను పరిష్కరించాలని జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం సైతం అందించామన్నారు. జిన్నింగ్ మిల్లుల నిర్వహణ భారంగా మారిందని, ప్రభుత్వం పరిశ్రమలు ప్రోత్సహించేందుకు మార్కెట్ ఫీజు మాఫీ చేయాలని కోరారు.

ఫల సాయం



రెబ్బెన మండలం పులికుంటలో జామ తోటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు (ఫైల్)

- పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- రాయితీలు, నిర్వహణ నిధులతో రైతులకు సహకారం
- జిల్లాలో క్రమంగా పెరుగుతున్న తోటలు
- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ

జిల్లా వివరాలు

పండ్ల తోటలు	ఎకరాలు
మామిడి	950
జామ	43.22
అరటి	37.75
పనస	23.5
రేగి	20.56

రెబ్బెన(ఆసిఫాబాద్): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోంది. ఆహార, వాణిజ్య పంటల సాగుకు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా ప్రోత్సహిస్తోంది. సంప్రదాయ పంటల సాగుతో రైతులు ఏటా నష్టాలను చవిచూస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్న విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పిస్తూ రైతులకు చేదోడుగా నిలుస్తోంది. ప్రభుత్వ సహకారంతో జిల్లాలో పండ్ల తోటల సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. సాగునీటి వసతి తక్కువగా ఉన్న రైతులు, పత్తి, వరి, కంది వంటి పంటల సాగుకే పరిమిత మైన వారు సైతం ఉద్యానవన శాఖ అధికారుల కృషితో ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారిస్తున్నారు.

1,075 ఎకరాల్లో పండ్ల తోటలు..

జిల్లాలో ఆది నుంచి గిరిజన, గిరిజనేతర రైతులు పత్తితోపాటు ఆహార పంటల సాగుపైనే ఆధారపడుతున్నారు. తేలికపాటి భూముల్లో ఆశించిన దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు అప్పుల బారిన పడుతున్నారు. వ్యవసాయమే దండుగ అనుకున్నవారిని క్రమంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు పండ్ల తోటల సాగు వైపు నడిపిస్తున్నారు. జిల్లా ఏర్పాటైన సమయంలో కేవలం 670 ఎకరాలకే పరిమితమైన పండ్ల తోటల సాగు.. ప్రస్తుతం 1,075 ఎకరాలకు చేరింది. పండ్ల తోటల సాగులో ఒక్కసారి పెట్టిన పెట్టుబడితో కొన్నేళ్లపాటు ఆదాయం సమకూరే అవకాశాలు ఉండటం రైతులకు కలిసి వచ్చే అంశం. ఉద్యానవన శాఖ అధికారులు తోటల సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ గ్రామాల్లో తోటల పెంపకం, సాగుతో కలిసి వచ్చే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

రాయితీలు, నిర్వహణకు నిధులు..

పండ్ల తోటలను సాగుచేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించడంతోపాటు తోటల నిర్వహణకు నిధులు సైతం సమకూరుస్తోంది. ఆర్థిక సహకారం అందుతుండటంతో తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మామిడి, జామ, సీతాఫలం, రేగి, అంజీరి వంటి పండ్ల తోటల సాగుకు మూడేళ్లు, అరటి, బొప్పాయి వంటి తోటలకు రెండేళ్లపాటు తోటలకు వెచ్చించే ఖర్చులో 40 శాతం రాయితీని అందిస్తోంది. రాయితీలో మొదటి సంవత్సరం 60 శాతం, రెండో ఏడాది 20 శాతం, మూడో ఏడాది మిగిలిన 20 శాతం అందిస్తున్నారు. అయితే ఏఏ పండ్ల తోటల సాగుకు ఎకరానికి ఎంత మొత్తంలో ఖర్చు అవుతుందో ప్రభుత్వం నిర్ణయిస్తోంది. అందులో నుంచి 40 శాతం రాయితీని మూడేళ్లపాటు రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటుంది. ఇక ఆయిల్‌పాం వంటి తోటల సాగుకు మొదటి నాలుగేళ్లపాటు ప్రతీ సంవత్సరం ఎకరానికి రూ.4,200 చొప్పున అందిస్తున్నారు. ఇందులో



కెరమెరి మండలం గోండుగూడలో అరటి తోట

రూ.2,100 మొక్కల సంరక్షణ, మిగిలిన రూ.2,100 అంతర పంటల సాగుకు సమకూరుస్తోంది. అలాగే రాయితీపై బిందు సేద్యం పరికరాలు, స్ప్రింకర్లను అయిల్‌పాం రైతులకు సరఫరా చేస్తున్నారు.

అన్నదాతలకు లాభం



సంప్రదాయ పంటల సాగుతో పోల్చితే పండ్ల తోటల సాగుతో అన్నదాతలకు లాభాలు ఉంటాయి. తేలికపాటి భూముల్లో సైతం పండ్ల మొక్కలు పెంచుకోవచ్చు. జిల్లాలో ప్రతీ సంవత్సరం 100 ఎకరాలకు మించి తోటల సాగు పెరుగుతోంది. ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు సమయంలో 670 ఎకరాల్లో తోటలు ఉండగా, ప్రస్తుతం 1,075 ఎకరాలకు పెరిగింది.

– ఎంఏ నదీం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

అభివృద్ధికి 'వారధి'

- వార్ధా నదిపై వంతెనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- కౌటాల మండలం గుండాయిపేట వద్ద నిర్మాణం
- రూ.75 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల
- ఆసిఫాబాద్ బహిరంగ సభలో ప్రకటించిన సీఎం కేసీఆర్



గుండాయిపేట వద్ద వార్ధా నదిపై వంతెన నిర్మాణ ప్రతిపాదిత స్థలం

కౌటాల: మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజల మధ్య ఏళ్లుగా సత్సంబంధాలు ఉన్నాయి. జిల్లా సరిహద్దు నుంచి కొన్నిచోట్ల నేరుగా రోడ్డు మార్గాలు ఉండగా, మరికొన్ని చోట్ల ప్రజలు పెన్‌గంగ, ప్రాణహిత నదుల మీదుగా నాటు పడవలతో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రజల రవాణా కష్టాలు తీర్చేందుకు జిల్లాలోని కౌటాల మండలంలో జీవనది వార్ధాపై అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. దీంతో ఇరు ప్రాంతాల ప్రజల చిరకాల కల నెరవేరనుంది. వంతెన నిర్మాణం పూర్తయితే తెలంగాణ–మహారాష్ట్ర బంధాలు మరింత బలపడటంతోపాటు వాణిజ్యపరంగా మేలు జరగనుంది. సరిహద్దున మారుమూల పల్లెలు ప్రగతిబాట పట్టనున్నాయి.

రూ.75 కోట్లతో వంతెన

కౌటాల మండలం గుండాయిపేట సమీపంలోని వార్ధా నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ఇరు ప్రాంతాల ప్రజలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పలుమార్లు శాసనసభ సమావేశాల్లోనూ ప్రస్తావించారు. గత జనవరిలో సీఎంవో కార్యాలయం ఆదేశాలతో గుండాయిపేట– నందివర్ధా వద్ద అంతర్రాష్ట్ర నిర్మాణం కోసం జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ వార్ధా నదిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రూ.75 కోట్ల నిధుల మంజూరుకు సంబంధించిన జీవోను ఎమ్మెల్యే కోనప్పకు ప్రజల సమక్షంలోనే అందించారు.

అభివృద్ధికి మార్గం సుగమం

తెలంగాణ– మహారాష్ట్ర మధ్య రవాణా కారిడార్‌కు గుండాయిపేట– నందివర్ధా అంతర్రాష్ట్ర వంతెన కీలకంగా మారనుంది. మహారాష్ట్రలోని చంద్రపూర్, బల్లార్షా పట్టణాలకు వెళ్లేందుకు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాల ప్రజలకు సుమారు 100 నుంచి 120 కిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది. గోండ్‌పిప్రి, బంగారంతలోది, చాముర్షీ, ఆడెగావ్, ఆష్టి, విఠల్‌వాడ ప్రాంతాల ప్రజలు కాగజ్‌నగర్, సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌ల మీదుగా ప్రయాణాలు కొనసాగించే అవకాశం ఉంది.

సరిహద్దు ప్రజల హర్షం

వార్ధా నదిపై వంతెన నిర్మాణంతో పల్లెలు అభివృద్ధి బాట పట్టనున్నాయి. కౌటాల మండల కేంద్రంతోపాటు గుండాయిపేట, తుమ్మిడిహెట్టి, వీర్దండి, మొగడ్‌దగడ్ గ్రామాల ప్రగతి మెరుగుపడనుంది. రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతోపాటు చిరువ్యాపారులకు జీవనోపాధి దొరకనుంది. స్వయంగా సీఎం కేసీఆర్ వంతెన నిర్మాణం చేపడతామని ప్రకటించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కౌటాల మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటాలకు ప్రజలు క్షీరాభిషేకం చేశారు.

రుణపడి ఉంటాం



గుండాయిపేట్ గ్రామం సమీపంలోనే వార్ధా నది ఉంది. మహారాష్ట్రలోని గ్రామాల్లో మాకు బంధువులు ఎక్కువగా ఉంటారు. పండుగలు, అవసరాల కోసం నది మీదుగా నాటుపడవలపై వెళ్తుంటాం. వంతెన నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషకరం. మా కష్టాలు గుర్తించిన ఎమ్మెల్యే కోనప్ప, సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– లహాంచు పటేల్, గుండాయిపేట

ప్రయాణ కష్టాలు దూరం



కౌటాల మండలం గుండాయిపేట వద్ద వార్ధా నదిపై అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణంతో సరిహద్దు గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. మారుమూల పల్లెలు వాణిజ్యపరంగా అభివృద్ధిలోకి వస్తాయి. కౌటాల మండల కేంద్రం.. మంచిర్యాల పట్టణంలాగా మారుతుంది. ఈ వంతెన నిర్మాణం కోసం ఎంతో కృషి చేశా. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కోనేరు కోనప్ప, ఎమ్మెల్యే

సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో గురుపౌర్ణమి వేడుకలు

నార్నూర్(ఆసిఫాబాద్): జైనూర్ మండలం పట్నాపూర్‌లోని శ్రీసిద్ధేశ్వర సంస్థాన్‌లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. పూలాజీ బాబా సమాధి వద్ద బాబా సతీమణి తిరుపతాబాయి, సంస్థ అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గం చూపి శ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాబా చూపిన మార్గంలో నడవాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో సంస్థాన్ ఉపాధ్యక్షుడు వామన్‌రావు, దాదారావు, భగవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జెండాకు పూజలు చేస్తున్న బాబా సతీమణి తిరుపతాబాయి, తదితరులు

ఒకే ఒక్కడు..!

- ఉమ్మడి జిల్లాలో కౌటాలకు మాత్రమే పర్మినెంట్ ఎంఈవో
- 69 మండలాలకు 27 మంది ఇన్‌చార్జీలు...
- ఒక్కొక్కరికి మూడు, నాలుగు మండలాల బాధ్యతలు
- పర్యవేక్షణ సక్రమంగా లేక బోధనకు ఆటంకాలు

జిల్లా	మండలాలు	ఎంఈవోలు
ఆదిలాబాద్	18	08
మంచిర్యాల	18	07
నిర్మల్	18	06
కుమురంభీం	15	06



కౌటాల మండల విద్యావనరుల కేంద్రం భవనం

మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి జిల్లాలో పాఠశాలల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల విద్యను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ఏటా రూ.కోట్లు కేటాయిస్తూ.. నూతన విద్యావిధానం ప్రకారం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుంది. అయితే క్షేత్రస్థాయిలో వాటిని పర్యవేక్షించే మండల విద్యాధికారులు మాత్రం లేరు. జిల్లాల పునర్విభజనతో కొత్త మండలాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. వాటికి ఇప్పటికీ ఎంఈవోలను నియమించలేదు. పాత మండలాలకే హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొత్త మండలాలు ఏర్పడిన తర్వాత వాటి బాధ్యత కూడా విద్యాశాఖ వీరికే అప్పగించింది. ఓ వైపు హెచ్‌ఎంగా, మరోవైపు రెండు మూడు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహించడం భారంగా మారుతోంది. తమ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించే సమయం లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. ఉమ్మడి జిల్లాలో 69 మండలాలు ఉండగా, కౌటాల మండలానికి మాత్రమే సోమయ్య రెగ్యులర్ ఎంఈవోగా ఉన్నారు.

హెచ్‌ఎంలకే ఎంఈవోలుగా..

కౌటాల మినహా మిగతా 69 మండలాలకు 26 మంది సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి మండల విద్యాధికారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరు ఒకవైపు తమ పాఠశాలల బాధ్యతలు పర్యవేక్షించడంతోపాటు, తాము ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ఒక మండలంలో 100 నుంచి 200 మంది ఉపాధ్యాయుల పనితీరు, 10 నుంచి 15 పాఠశాలల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. ఇక ఒక్కో ఇన్‌చార్జి ఎంఈవోకు రెండు, మూడు మండలాల బాధ్యతలు అప్పగించారు. అంటే ఒక ఇన్‌చార్జి ఎంఈవో కనీసం 500 మంది ఉపాధ్యాయుల పనితీరు, 40 నుంచి 50 పాఠశాలల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. దీంతో అటు హెచ్‌ఎంగా సొంత పాఠశాలకు, ఇటు ఎంఈవోగా సరైన న్యాయం చేయలేకపోతున్నారు.

18 ఏళ్లుగా ఒకే మండలంలో..



ఏ ప్రభుత్వ శాఖ ఉద్యోగికి అయినా బదిలీలు, ప్రమోషన్లు ఉంటాయి. కానీ విద్యాశాఖలో ఎంఈవోల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దీంతో ఏళ్ల తరబడి ఒకే మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. అక్కడే రిటైర్ అవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఏకైక రెగ్యులర్ ఎంఈవో సోమయ్య 18 ఏళ్లుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన సోమయ్య 1997లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2005లో రెగ్యులర్ ఎంఈవోగా ప్రమోషన్ రావడంతో కౌటల మండలం ఎంచుకున్నాడు. తర్వాత ఉమ్మడి సర్వీసుకు సంబంధించి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో ఎంఈవోల బదిలీలు, ప్రమోషన్లు నిలిచిపోయాయి. అప్పటి నుంచి బదిలీ, పదోన్నతికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం కౌటాలకు రెగ్యులర్ ఎంఈవోగా, సిర్పూర్ (టి), చింతలమానెపల్లి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.

అసలే ఇన్‌చార్జీలు.. ఆపై అదనపు బాధ్యతలు..

ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలకు ఎనిమిది మంది, మంచిర్యాలలో 18 మండలాలకు ఏడుగురు, నిర్మల్ జిల్లాలో 18 మండలాలకు ఆరుగురు, కుమురంభీం జిల్లాలోని 15 మండలాలకు ఆరుగురు(కౌటాల మినహా) అంతా ఇన్‌చార్జి ఎంఈవోలే. వీరంతా తమ పాఠశాలలో ఒకటి రెండు పీరియడ్‌లు పాఠాలు బోధించాలి. మిగతా సమయాల్లో పాఠశాలకు సంబంధించిన నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించాలి. మరోవైపు తాము ఇన్‌చార్జిగా ఉన్న మండలాల్లో ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల నిర్వహణను కూడా చూసుకోవాలి. తనిఖీలు చేయాలి. ఏళ్లుగా ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో హెచ్‌ఎంలనే ఇన్‌చార్జి ఎంఈవోలుగా విద్యాశాఖ నియమిస్తోంది. ఈ కేసు కొలిక్కి వస్తేగానీ పూర్తిస్థాయి ఎంఈవోలు వచ్చే అవకాశం లేదు.

ఎప్పుడు ఏ మండలంలో ఉంటారో..

ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నవారు ఎప్పుడు ఏ మండలంలో ఉంటారో తెలియని పరిస్థితి. ఉపాధ్యాయులు ఎంఈవోను కలవాలంటే.. ముందుగా ఎక్కడ ఉన్నారో తెలుసుకుని ఆ మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఇక విద్యాశాఖ సమీక్షలు, సమావేశాలు ఉంటే.. జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిందే.

ఫలితాలపై ప్రభావం..

పాఠశాలల పనితీరు పర్యవేక్షణతోపాటు తనిఖీలు చేసే అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ఈ క్రమంలో కొంతమంది ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమయపాలన పాటించడం లేదు. సమాచారం లేకుండానే గైర్హాజరవుతున్నారు. ఈ కారణంగా పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రభావం ఫలితాలపై పడుతోంది.

ఐటీడీఏ పీవోగా చాహత్ బాజ్‌పాయ్

ప్రొఫైల్

పేరు: చాహత్ బాజ్‌పాయ్
ఐఏఎస్ బ్యాచ్: 2019 ఏపీ క్యాడర్
తల్లిదండ్రులు: ఉషా, ఆర్‌పీ బాజ్‌పాయ్
పుట్టినతేదీ: 14.12.1994
విద్యాభ్యాసం: ఐఐటీ కాన్పూర్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీర్ పట్టా
భర్త : కర్నాటి వరుణ్‌రెడ్డి, ఐఏఎస్
తొలి పోస్టింగ్: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు అసిస్టెంట్ కలెక్టర్
పదోన్నతి: కర్నూల్ జిల్లా నంద్యాల సబ్ కలెక్టర్
తెలంగాణ ఐఏఎస్ క్యాడర్‌కు బదిలీ అయిన తేదీ: 26.08.2021
ప్రస్తుతం: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా సేవలు

- పతి స్థానంలో సతీమణి నియామకం
- మూడో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపిక



కైలాస్‌నగర్/ఆసిఫాబాద్: ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన చాహత్ బాజ్‌పాయ్ గతేడాది జూన్ 13న కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత నిర్మల్ జిల్లా కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సతీమణి చాహత్ బాజ్‌పాయ్. ఎలక్ట్రికల్ ఇంజినీర్‌లో కాన్పూర్ ఐఐటీ నుంచి పట్టా అందుకున్న ఆమె ఐఏఎస్ లక్ష్యంగా యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. మూడో ప్రయత్నంలో 59వ ర్యాంకు సాధించి ఏపీ క్యాడర్ 2019 బ్యాచ్ ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వరుణ్‌రెడ్డిని వివాహమాడాక తెలంగాణ క్యాడర్‌కు బదిలీ అయ్యారు. వరుణ్‌రెడ్డి బదిలీతో ఖాళీ అయిన ఆసిఫాబాద్ జిల్లా లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్‌గా 2021లో నియామకమయ్యారు. ఏడాదిన్నర పాటు అక్కడ సేవలందించిన ఆమె తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు ఐటీడీఏ పీవోగా విధులు నిర్వర్తించిన వరుణ్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 8న నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అప్పటినుంచే ఆ స్థానంలో చాహత్ బాజ్‌పాయ్ రానున్నారనే ప్రచారం అధికారిక వర్గాల్లో పెద్ద ఎత్తున జరిగింది. ఈ క్రమంలో నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన రిజ్వాన్ బాషాషేక్ ఇటీవల వరంగల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వస్తారనే ప్రచారం సైతం జోరుగా సాగింది. ఆ ప్రచారాలకు తెర దించుతూ ఆమె ఐటీడీఏ పీవోగా నియామకమయ్యారు. తన భర్త పనిచేసిన రెండుచోట్ల ఆమె నియామకం కావడం ఆసక్తికరంగా మారింది. నిజాయతీగా, ముక్కుసూటిగా బాధ్యతలు నిర్వహిస్తారనే పేరున్న చాహత్ బాజ్‌పాయ్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా రానుండడంతో ఆదివాసీల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా సోమవారం పీవోగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

చుక్కల దుప్పిని కాపాడిన యువకులు



దుప్పిని బయటకు తీసిన యువకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని ఓ మామిడితోటలోని బావిలో పడినపోయిన దుప్పిని మాలగురిజాల గ్రామ యువకులు కాపాడారు. ఆదివారం మాలగురిజాల గ్రామానికి చెందిన గోమాస రాయలింగు, భాస్కర్, రత్నం స్వామిలు గ్రామ శివారులోని తమ మామిడితోటకు పని నిమిత్తం వెళ్లారు. ఇదే క్రమంలో తోటలోని బావిలో చుక్కల దుప్పి కనిపించింది. విషయాన్ని బెల్లంపల్లి అటవీశాఖ అధికారులకు తెలుపడంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సువర్ణ సిబ్బందితో అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో బావిలో నుంచి దుప్పిని బయటకు తీయించింది. అనంతరం దుప్పి దాహాన్ని తీర్చి చర్లపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. మూడు రోజుల క్రితం ఆ దుప్పి ప్రమాదవశాత్తు బావిలో పడి ఉంటుందని సువర్ణ తెలిపారు. వన్యప్రాణిని కాపాడిన యువకులను ఆమె అభినందించారు.

పంచాయతీ కార్యదర్శిపై అట్రాసిటీ కేసు

జన్నారం: మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట్‌పై ఎస్సీ, ఎ స్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తానాజీ నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జూన్ 8న గ్రామంలో నిర్వహించిన చెరువుల పండుగ సందర్భంగా గ్రామ కార్యదర్శి గ్రామంలోని వో రుగంటి శ్రీనివాస్‌ను డప్పులు కొట్టడానికి రా వాలని కులం పేరుతో మాట్లాడి అవమానించాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని అతడి సోదరుడు సత్తయ్య ఫిర్యాదు చేశాడు. దీంతో వెంకట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం



షబనాజ్ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన షబనాజ్(40) మృతదేహం ఆదివారం ఓ పాడుబడిన బావిలో లభ్యమైంది. జిల్లా కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ సిద్దిక్ భార్య షబనాజ్ గత నెల 15న అదృశ్యమైంది. ఆమె కుమారుడు సోహెల్ ఈనెల 19న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం చింతగూడ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలోని పాడుబడిన బావిలో పశువుల కాపరికి మృతదేహం కనిపించింది. దీంతో విషయం తెలుసుకున్న ఏఎస్సై మాను, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్ సంఘటన స్థలానికి చేరుకుని ఒంటిపై ఉన్న దుస్తుల ఆధారంగా షబనాజ్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు.

రాపల్లి శివారులో గుప్తనిధుల కోసం తవ్వకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రాంతంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న కొంతమందిని హాజీపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ సంఘటన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కింద ముంపునకు గురైన పాతరాపల్లి గ్రామంలో శనివారం రాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. లైట్ల వెలుతురు గమనించిన స్థానిక వీఆర్ఏ సత్యనారాయణ మోటార్ సైకిల్‌పై అక్కడికి వెళ్లడంతో అతడిని చూసి పారిపోయారు. ఓ జేసీబీ, దాని ఆపరేటర్‌ను పోలీసులకు అప్పగించారు. ఇందులో దొనబండకు చెందిన గాదర్ల రమేశ్, జాప అశోక్, అయ్యగారు పొలాస సాయి, మంచిర్యాలకు చెందిన సాయికృష్ణతో పాటు మరికొంత మంది ఉన్నట్లు ఆపరేటర్ తెలిపాడు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

జంగిల్ సఫారీకి బ్రేక్



జంగిల్ సఫారీలో అడవుల్లో పర్యటిస్తున్న పర్యాటకులు (ఫైల్)

- జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేత
- అక్టోబర్ నుంచి తిరిగి ప్రారంభం

జన్నారం: కవ్వాల్ అభయారణ్యం అంటేనే అడవులు, వన్యప్రాణులకు పెట్టింది పేరు. పక్షుల కిలకిల రావాలు, లేడి పిల్లల పరుగులు, జలజలమంటూ దట్టమైన అడవుల మధ్య నుంచి పారే సెలయేర్లు, పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం ఇవి కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లోని ప్రత్యేకతలు. ఈ అందాలను తిలకించేందుకు పర్యాటకశాఖ జన్నారంలో హరిత రిసార్ట్‌లు, రెస్టారెంట్లతో పాటు జంగిల్ సఫారీలు ఏర్పాటు చేసింది. జన్నారం వచ్చిన పర్యాటకులు సఫారీలో అడవిలోకి వెళ్లడం, దట్టమైన అడవిలో పచ్చని చెట్ల నడుమ పర్యటించడంతో ఆహ్లాదాన్ని పొందుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు అడవుల అందాలను, వన్యప్రాణుల పరుగులను చూసేందుకు వస్తుంటారు. పర్యటకశాఖ అధికారులు రిసార్ట్ ద్వారా సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

తాత్కాలిక బ్రేక్...

అడవుల అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకులకు మూడు నెలల పాటు ఈ ఆహ్లాదం కోల్పోతారు. ఎందుకంటే అటవీశాఖ అధికారులు జంగిల్ సఫారీలు అడవుల్లోకి వెళ్లేందుకు అనుమతి నిరాకరిస్తున్నారు. వర్షాకాలంలో వన్యప్రాణులు బయటకు వస్తాయి. ఎదకు వచ్చి బయట తిరుగడానికి ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో అటవీశాఖ అధికారులు పర్యాటకులను సఫారీల ద్వారా ఈ నెల నుంచి అడవుల్లోకి అనుమతి రద్దు చేశారు. ఇన్ని రోజులు రిసార్ట్‌కు వచ్చిన పర్యాటకులు ఉదయాన్నే జంగిల్ సఫారీల ద్వారా అడవులకు వెళ్లితే వన్యప్రాణులు ప్రత్యేక్షంగా కనిపించడం, వన్యప్రాణులతో పాటు పచ్చని వాతావరణంతో పర్యటకులు ఆహ్లాదం పొందుతారు. ఇక్కడికి వచ్చే అత్యధిక మంది పర్యాటకులు అడవులు, వన్యప్రాణులను చూసేందుకే వస్తారు. కానీ అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల స్వచ్ఛకు భంగం కలిగించొద్దని, అడవుల్లో వర్షాలకు బురద కారణంగా ఇబ్బంది ఏర్పడుతుందనే ఉద్దేశంతో మూడు నెలలు (జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) అనుమతులు నిరాకరిస్తూ అటవీశాఖ అధికారులు పర్యాటక శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.

పెరిగిన తాకిడి...

జన్నారం పర్యటకశాఖకు పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. వీకెండ్ రోజులు శుక్ర, శని, ఆదివారాల్లో హరిత రిసార్ట్‌లు అన్నీ నిండుకుంటున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తమ వాహనాలతో రోడ్డు మార్గంలోని అడవులను చూసి ఆహ్లాదాన్ని పొందుతున్నారు. ఇన్ని రోజులు ఎండలకు సతమతమైన వారు ఇప్పుడు చల్లగా, పచ్చదనం కోసం ఇక్కడికి వస్తుంటారు. సఫారీ ద్వారా వెళ్లడానికి బ్రేక్ వేయడంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారు.

వర్షం పడితే వాహనాలకు ఇబ్బంది...



వన్యప్రాణులకు ఇబ్బందులు కాకుండా, వర్షాల కారణంగా బురదలో వాహనాలు కూరుకుపోయి ఇబ్బందుల ఏర్పడే అవకాశం ఉంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతో జూలై నుంచి సెప్టెంబర్ వరకూ అడవుల్లో జంగిల్ సఫారీలకు అనుమతి ఇవ్వడం లేదు.

– సిరిపురం మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

రైళ్లకు హాల్టింగ్ పునరుద్ధరణ



బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు

బెల్లంపల్లి: కరోనా ప్రభావంతో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తి వేసిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే పలు రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుని పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రైల్వే అధికారులకు ఉత్తర్వులు జారీ కాగా ప్రయాణికులకు రవాణా సౌకర్యం మరింతగా అందుబాటులోకి వచ్చింది. రైల్వేబోర్డు తీసుకున్న తాజా నిర్ణయంతో జిల్లాలోని బెల్లంపల్లి ప్రధాన రైల్వేస్టేషన్‌తో పాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఎత్తివేతకు గురైన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు యథావిధిగా హాల్టింగ్ సౌకర్యం కల్పించడం శుభ పరిణామంగా చెప్పవచ్చు. సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వడంతో ప్రయాణికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కరోనా కారణంగా దాదాపు రెండున్నర ఏళ్ల నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించకుండా కట్టడి చేశారు.

హాల్టింగ్ కల్పించిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇవే...

ప్రయాణికుల రద్దీ, అవసరాల రీత్యా పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టింగ్‌కు నోచుకున్నాయి. వీటిలో హైదరాబాద్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వెళ్లే (రైలు నెం.12721) దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – రాయ్‌పూర్ (రైలు నెం.12771) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – గోరక్‌పూర్ (రైలు.నం.12590) ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం –పాట్నా (రైలు నం.22669) ఎక్స్‌ప్రెస్, హజ్రత్ నిజాముద్దీన్ – తిరుపతి (రైలు నం.12708) ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, ఎఎంవీటీ బెంగళూరు – పాటలీపుత్ర (రైలు నం.22352) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

హాల్టింగ్ ఇచ్చిన రైల్వేస్టేషన్లు...

సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రధాన రైల్వే స్టేషన్‌ల్లో హాల్టింగ్ కల్పించారు. వీటిలో హైదరాబాద్ – హజ్రత్ నిజాముద్దీన్ దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ –రాయ్‌పూర్, సికింద్రాబాద్ –గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం –పాట్నా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో కొత్తగా హాల్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎస్ఎంవీటీ బెంగుళూరు – పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదే తీరుగా హజ్రత్ నిజాముద్దీన్ –తిరుపతి ఏపీ సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు బెల్లంపల్లి, రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్‌ను పునఃరుద్ధరించారు.

జీటీ ఎక్స్‌ప్రెస్‌కు అవకాశం కల్పించరూ...

తిరుపతి దైవ దర్శనానికి బెల్లంపల్లి పరిసర ప్రాంతాల నుంచి రోజువారీగా పదుల సంఖ్యలో వెళ్తుంటారు. ఈ ప్రాంతం నుంచి తిరుపతి వెళ్లడానికి జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు సౌకర్యవంతంగా ఉంటుంది. డౌన్ మార్గంలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వగా అప్ మార్గంలో ఎత్తివేశారు. దైవ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం చేయడానికి జీటీ ఎక్స్‌ప్రెస్ ఉన్నా బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో నిలుపుదలకు ఆదేశాలు జారీ కావడం లేదు. దీంతో ఈ ప్రాంత ప్రయాణికులు మంచిర్యాల లేదా రామగుండం, కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లలో దిగి బెల్లంపల్లికి చేరుకోవాల్సి వస్తోంది.

రైల్వేబోర్డు సరైన నిర్ణయం తీసుకుంది



తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తిరిగి హాల్టింగ్ కల్పించడం సంతోషం కలిగిస్తోంది. ఆయా రైళ్లకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో పాత పద్ధతిలోనే హాల్టింగ్ ఇచ్చారు. తద్వారా ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువ కానుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి మార్గం సుగమమైంది. రైల్వేబోర్డు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇన్నాళ్లుగా పడిన తిప్పలు తప్పనున్నాయి.

– బిని గోపాల్ కార్వా, వ్యాపారీ, బెల్లంపల్లి

జీటీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వాలి



పుణ్యక్షేత్రమైన తిరుపతికి బెల్లంపల్లి చుట్టు పక్క ప్రాంతాల నుంచి రోజువారీగా భక్తులు వెళ్తుంటారు. జీటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో గూడూరు వరకు వెళ్లడానికి అనుకూల పరిస్థితులు ఉండగా తిరుగు ప్రయాణంలో జీటీ ఎక్స్‌ప్రెస్‌కు బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వలేదు. దీంతో దైవదర్శనానికి వెళ్లిన భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– హన్మాన్ జోషి, వ్యాపారస్తుడు, బెల్లంపల్లి

చినరాస్పెల్లిలో ఒకరి హత్య

- భార్య, కూతురే హత్య చేసినట్లు అనుమానాలు ?



వెల్మలే పుల్లయ్య (ఫైల్)

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన వెల్మలే పుల్లయ్య (43) హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పుల్లయ్య మద్యం తాగి భార్యతో తరచుగా గొడవపడేవాడు. అదే క్రమంలో శనివారం మధ్యాహ్నం కూడా మద్యం మత్తులో భార్య మంగతో గొడవపడ్డాడు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకూ పుల్లయ్య, భార్య మంగ, కూతురు తేజరాణిలు కనపడకపోవడంతో పుల్లయ్య సోదరుడు హన్మంతుకు అనుమానం వచ్చి ఆదివారం ఉదయం ఇంటికి వెళ్లాడు. పుల్లయ్య రక్తపు మడుగులో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పుల్లయ్య రక్తపు మడుగులో పడి ఉండడంతో పాటు మృతదేహంపై కారంపొడి చల్లి ఉండడం, చంపడానికి ఉపయోగించిన బాడ్గా కనపడడంతో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుడి భార్య మంగ, కూతురు తేజరాణిలు కనపడకపోవడంతో వారే హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ నాగరాజు చెప్పారు.



రక్తపుమడుగులో పుల్లయ్య మృతదేహం

ఏఎన్ఎం తీరుపై మండిపాటు...

- టీకా కోసం వెళ్లిన ఓ బాలింతపై ఏఎన్ఎం అసహనం
- టీకా వేయకుండానే వెనక్కు పంపిన వైనం..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రైవేట్ ఆస్పత్రిలో బిడ్డను కని టీకాల కోసం ప్రభుత్వ ఉచిత సేవలు కావాలా అంటూ బాలింతపై ఓ ఏఎన్ఎం అసహనం వ్యక్తం చేసింది. స్థానికుల వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీకి చెందిన నిమ్మల శ్రావణి మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికలో పాపకు జన్మనిచ్చింది. దాదాపు 40రోజుల తర్వాత హాజీపూర్ మండలం రాపల్లిలో ఉంటున్న పిన్ని, బాబాయ్‌ల ఇంటికి ఇటీవల వచ్చింది. శ్రావణి పాపకు 45రోజుల ఓపీవీ, ఆర్‌వీవీ, పీసీవీ, పెంటా టీకాల కోసం ఆదివారం రాపల్లిలోని స్టేజీ వద్ద మెడికల్ దుకాణంలోని ఏఎన్ఎం మాలతి వద్దకు వెళ్లింది. మాలతి పాప ఎక్కడ పుట్టిందని అడుగగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జన్మించినట్లు శ్రావణి చెప్పింది. దీంతో ఏఎన్ఎం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ప్రైవేట్ ఆస్పత్రిలో జన్మిస్తే ఇక్కడ ప్రభుత్వ టీకాలు ఎందుకేస్తామని, టీకా వేసేది లేదని వెనక్కి పంపించింది. కాగా ఈ విషయమై హాజీపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లహరిని వివరణ కోరగా ఈ విషయంపై ఆరా తీసి మరోసారి ఇలాంటివి జరగకుండా చూస్తామని తెలిపింది. ఇక గతంలో ఈ ఏఎన్ఎం తీరుపై జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేసినా మార్పురావడం లేదని స్థానికులంటున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి



మాట్లాడుతున్న నరహరి

పాతమంచిర్యాల: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడాలని ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని దక్కన్ ఎలక్ట్రానిక్స్ షో రూంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా, సికిల్‌సెల్, కిడ్నీవ్యాధిగ్రస్తులు, గర్భిణులు, ప్రమాదాల బారిన పడిన వారి కోసం ప్రతీ మూడునెలలకోసారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో జన్నారం తహసీల్దార్ ఇత్యాల కిషన్, కలెక్టరేట్ ఏవో సంతోష్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ చందూరి మహేందర్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, పాల్గొన్నారు.

రక్తదానంలో యువకుల కీలకపాత్ర

బెల్లంపల్లి: రక్తదానం చేయడంలో యువకులు కీలక భూమిక పోషిస్తున్నారని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి హాజరై మాట్లాడారు. ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవసరమైన వారికి ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. డాక్టర్ రమణ, నక్షత్ర ఇన్ఫ్రాహైట్స్ సంస్థ డైరెక్టర్ మేరుగు ప్రభాకర్, చైర్మన్ కంభంపాటి బసవేశ్వరరావు, ఆలయ ఫౌండేషన్ సభ్యులున్నారు.

24 రైళ్లు రద్దు

మంచిర్యాలక్రైం: హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో రైల్వే ట్రాక్ లైన్ మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మంచిర్యాల మీదుగా నడవాల్సిన 24 రైళ్లు రద్దు చేయడం జరిగిందని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

డువ్వల్‌పేన్‌కు ప్రత్యేక పూజలు

- మూడేళ్లకు ఓసారి మొక్కులు
- అనాదిగా వస్తున్న ఆచారం
- పులిని వేటాడిన చోటే ముండ(కర్ర)ను పాతిన సాకడ ఆదివాసీలు



భక్తి శ్రద్ధలతో పాతిన ముండ(కర్ర)



పులిదేవతకు మొక్కుతున్న సాకడా వాసులు

కెరమెరి: అటవీ జంతువులను దేవతలుగా భావించి.. వాటి నుంచి రక్షణ కల్పించడంలో తమకు తామే సాటిగా ఆదివాసీలు నిలుస్తున్నారు. ఆషాఢమాసం వచ్చిందంటే విభిన్న పండుగలు చేస్తూ తమ పూజలతో అడవి తల్లితో పాటు కుల దేవతలను సైతం ప్రసన్నం చేసుకుంటున్నారు. మండలంలోని చిన్నసాకడకు చెందిన ఆదివాసీలు పులివేటను కట్టడి చేసేందుకు 1935లో ప్రారంభించిన 'డువ్వల్ పేన్' (పులి దేవత) పూజను నేటికి నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆ గ్రామంలోని శివారులో పులి దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. నూతంగా ముండ(కర్ర)ను పాతి వనంలో ఉత్సవం చేసుకున్నారు. వనంలోనే వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనం చేశారు.

డువ్వల్ పేన్(పులిదేవత)కు పూజ..

అది 1935వ సంవత్సరం.. పెందోర్ జంగు కుటుంబం చిన్నసాకడ గ్రామంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంది. ఆ చుట్టుపక్కల గ్రామాలు లేవు. నాలుగు కిలో మీటర్ల దూరంలో కెరమెరి, పెద్దసాకడ, సాకడ(ఏ) అనే గ్రామాలతో పాటు 15కిలో మీటర్ల దూరంలో అనార్‌పలి, గోయగాం తదితర గ్రామాలున్నాయి. ఆ గ్రామాల్లో కూడా అతి తక్కువ కుటుంబాలు ఉండేవి. ఈ తరుణంలోనే పెద్దపులి తన పిల్లలతో అడవిలోకి ప్రవేశించింది. సాగు చేసేందుకు అడవిని నరికేందుకు వెళ్లిన రైతులను వేటాడి చంపి తినేది. విషయం తెలుసుకున్న పెందోర్ జంగు పులిని పట్టుకునేందుకు చాలాసార్లు చేసిన ప్రయత్నం ఫలించలేదు. అడవులను నరికి వ్యవసాయం చేద్దామని వెళ్లిన కొహ్చాడ శేకును అతడి ముందే పులి పట్టుకుని వెళ్లి చంపేసింది. దీంతో కసిపెంచుకున్న జంగు ఓ రోజు నీళ్లు తాగేందుకు వచ్చిని పులిని నీరు తాగుతున్నప్పుడు బండరాయితి కొట్టి చంపాడు. అనంతరం శేకు చనిపోయిన చోట పులిదేవత ముండ(కర్ర)పాతి ప్రత్యేక పూజలు చేశారు. అప్పటి నుంచి మూడేళ్లకోసారి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ఎంతో నియమనిష్టతో..



ప్రతీ మూడేళ్లకు ఓసారి డువ్వల్ పేన్ పూజలను ఎంతో నియమ నిష్టతో చేస్తాం. మా తాత నుంచి వస్తున్న ఆచారాలు, సంస్కృతిని, దేవతలను పూజిస్తున్నాం. పెద్దలు చూపిన మార్గంలోనే ఇప్పటికీ నడుస్తున్నాం.

– పెందోర్, దంబిరావు, కటోడా చిన్నసాకడ


చంపిన చోటే పూజ



శేకు అనే రైతును చంపిన చోటే ఓ ముండ(కర్ర) పాతి పూజలు చేశాం. ఆకాడి రోజే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అషాఢ మాసంలో వనదేవతలు, ఇంటి దేవతలు, పెర్సాపేన్, ఏత్మాసార్, ఆకి పేన్‌కు పూజలు చేస్తే అన్ని సవ్యంగా జరుగుతాయి.

– సెడ్మకి జంగు, గ్రామ పెద్ద, చిన్నసాకడ

పసికందు మృతికి కారణమైన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



బాధితులను పరామర్శిస్తున్న కృష్ణ

తాండూర్: డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంతో మూడు నెలల పసికందు మృతి చెందాడని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ అన్నారు. ఆదివారం తాండూర్ మండల కేంద్రం ఐబీ కొత్త గుడిసెల ప్రాంతంలోని బాధిత తల్లిదండ్రులు జాడి కిషన్, కళావతి దంపతులను ఆయన పరామర్శించి మాట్లాడారు. స్వల్ప అనారోగ్య సమస్యతో చిన్నారిని బెల్లంపల్లిలోని నిత్య పిల్లల ఆస్పత్రికి తీసుకురాగా డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతో శిశువు ప్రాణాలు కోల్పోయిందని మండిపడ్డారు. వెంటనే ఆ డాక్టర్, సిబ్బందిపై పోలీసులు హత్యానేరం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పిల్లల ఆస్పత్రిని సీజ్ చేసి సదరు డాక్టర్ మెడికల్ ప్రాక్టీసు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) శ్రేణులు అరుణ్, పసులేటి వెంకటేష్, స్రవంతి, రాధ, లక్ష్మి పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో రక్షణ పరికరాలు వినియోగించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గని ప్రమాదాల నివారణకు ప్రతీ ఉద్యోగి పని ప్రదేశాల్లో రక్షణ పరికరాలను విధిగా వినియోగించాలని సేఫ్టీ జీఎం (కార్పొరేట్) గురువయ్య అన్నారు. ఆదివారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓబీ కార్మికులకు నా భద్రత నా బాధ్యతే.. నా భద్రతే నా కుటుంబ భద్రత అంటూ సురక్షితమైన పని విధానాలు, పద్ధతుల అమలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేట్ సేఫ్టీ జీఎంతో పాటు రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఏరియా జీఎం దేవేందర్, జీఎం సేఫ్టీ సాంబయ్య, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భద్రతపై అవగాహన డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కార్పొరేట్ మాట్లాడుతూ మానవ తప్పిదాలతోనే గనుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాటిని నివారించుదుకే సింగరేణి వ్యాప్తంగా భద్రతపై అవగాహన డ్రైవ్ కొనసాగుతోందన్నారు. పని ప్రదేశాల్లో ప్రతి ఒక్కరూ రక్షణ పరికరాలను వినియోగించి గని ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఏరియా ఇంజనీర్ తిరుమల్‌రావు, ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ప్రాజెక్టు ఇంజనీర్ నరేస్, జీఆర్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.